పటాకులు కాల్చి సంబురాలు చేసుకొంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అంబరాన్నంటిన దీపావళి వేడుకలు

బాలానగర్, నవంబర్ 1: కూకట్‌పల్లి నియోజకవర్గంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం పర్వదినం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన వ్యవసాయ క్షేత్రంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, కేపీహెచ్‌బీకాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషబాబురావు, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ పి.సతీశ్‌గౌడ్, మూసాపేట మాజీ కార్పొరేటర్ టి.శ్రావణ్‌కుమార్ ఆయా ప్రాంతాల్లో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

మియాపూర్: దీపావళి పండుగను పురస్కరించుకుని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్, చందానగర్ కాంగ్రెస్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి సహా నియోజకవర్గంలోని ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పీఏసీ చైర్మన్ గాంధీని ఆయన నివాసంలో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను డివిజన్‌లోని పలు కాలనీల ప్రజలు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, నేతలు

వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాళులర్పించిన పలువురు నేతలు

బాలానగర్, నవంబర్ 1: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కూకట్‌పల్లిలో జాతీయ ఐక్యత దినం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ కార్యక్రమానికి ఆయనతో పాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర భారత తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ప్రతిభతో పదవిబాధ్యతలు కొనసాగించిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. దేశంలోని పలు సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రన్‌ఫర్ యూనిటీ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, మాధవరం కాంతారావు తదితరులు

వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత రాజు తదితరులు

నిజాంపేట్ మున్సిపల్ పరిధిలో..

దుండిగల్ : సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత డా.ఎంఆర్ఎస్. రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన పలువురు పాల్గొని సర్దార్ పటేల్‌కు నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ చంద్రమౌళి, చక్రధర్, దేవేందర్‌రెడ్డి, శేషారావు, మైలారం అశోక్, కౌశిక్‌నాయుడు, రామారావు, వీరాంజనేయులు, బాబు, రాజు, వినయ్, అంజి, విశ్వనాథబాబు, మయూర్ పటేల్, కిశోర్, జగదీశ్, సూరిబాబు పాల్గొన్నారు.

పటేల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, కాలనీవాసులు

కేపీహెచ్‌బీ డివిజన్‌లో..

బాలానగర్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సర్దార్‌పటేల్‌నగర్‌లో నిర్వహించిన వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సర్దార్‌పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశాన్ని ఐక్యం చేయడంలో సంకల్పంతో పని చేసిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీని అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

మియాపూర్, నవంబర్ 1 : పేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తున్నదని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్‌కు చెందిన నాగమ్మ వైద్య సేవల నిమిత్తం సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌వోసీని శుక్రవారం గాంధీ తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కాశీనాథ్, సైదేశ్వర్, రాజేశ్, కుమార్ పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

టీటీడీ చైర్మన్‌గా నియామకమైన బీఆర్‌నాయుడును మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- మియాపూర్, నవంబర్ 1

మిత్ర హిల్స్ పార్కును సుందరీకరించాలి

హెచ్ఎండీఏ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేత రవికుమార్ తదితరులు

మియాపూర్ , నవంబరు 1 : హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 65లో ఉన్న మిత్ర హిల్స్ పార్కును సుందరీకరించి అందుబాటులోకి తీసుకురావాలని నియోజకవర్గ బీజేపీ నేత రవికుమార్ హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కోరారు. ఈ మేరకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాసిన వినతి పత్రాన్ని రవికుమార్ కమీషనర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు నిర్వహణ సరిగా లేక విష సర్పాలు సంచరిస్తున్నాయని, అపరిశుభ్ర వాతావరణంతో తీవ్ర అసౌకర్యంగా ఉండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. పార్కును తక్షణమే శుభ్రం చేసి చిన్నారులు ఆడుకునేలా తీర్చిదిద్దాలని, పార్కు సుందరీకరణ ద్వారా సమీపంలోని 800 గృహాలకు ఆహ్లాదం అందించినట్లు అవుతుందని రవికుమార్ పేర్కొన్నారు. వినతిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ నేత సీతారామరాజు, భరత్‌కుమార్, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు శిక్షణ ప్రారంభం

శిక్షణలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు

మియాపూర్, నవంబరు 1 : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఈ నెల 5వ తేదీ నుంచి చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణన సర్వేకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. జోన్ పరిధిలోని శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీపురంపటాన్‌చెరు, యూసుఫ్‌గూడ సర్కిళ్లలో ఈ నెల 1 నుంచి 4 వ తేదీ వరకు ఎన్యుమరేటర్లకు నాలుగు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగనున్నది. జోన్ వ్యాప్తంగా 3,02,858 నివాసాల్లో ఈ నెల 20వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నారు. నాలుగు సర్కిళ్లలో కలిపి 2211 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్నారు. అయితే నాలుగో తేదీలోగా ఎన్యుమరేటర్లకు పూర్తి స్థాయిలో శిక్షణను పూర్తి చేయాల్సి ఉండగా.. సిబ్బంది కొరత కొంత మేర అధికారులను కలవరపెడుతున్నది. ఆశ వర్కర్లు, అంగన్ వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులను తీసుకున్నప్పటికీ ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయులు దూరంగా ఉంటున్నారు. ఈ ప్రభావం సర్వేపై చూపకుండా జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి రంగంలోకి దిగి సర్కిళ్ల డీసీలు, పీవోలను అలర్ట్ చేస్తూ ఎన్యుమరేటర్లను పూర్తిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసారు. అయినప్పటికీ ఇంకా కొంత మేర కొరత ఉన్నట్లు పర్యవేక్షకులు చెబుతున్నారు. ఈ అంశంపై జోనల్ కమిషనర్‌ను సంప్రదించగా...సర్వేకు ఎన్యుమరేటర్ల కొరత లేదని, అవసరమైన సంఖ్య కంటే అదనంగా పది శాతం సమకూర్చుకున్నట్లు తెలిపారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు

సదర్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సబిహబేగం

అల్లాపూర్, నవంబర్1: అల్లాపూర్ డివిజన్ పరిధి శ్రీ వివేకానందనగర్‌లో శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో దోషాల నర్సింగ్ యాదవ్, చిన్నబోయిన కార్తిక్ యాదవ్ సమక్షంలో యాదవ సదర్ సమ్మేళనం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ సబిహబేగం ముఖ్యఅతిథిగా హాజరై ఈ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో మహేశ్‌యాదవ్, సురేశ్‌యాదవ్, శివయాదవ్, బాలరాజ్‌యాదవ్, రవీందర్ యాదవ్, ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో..

మూసాపేట : పాడి పరిశ్రమలాభివృద్ధి కోసం యాదవులు ఆనవాయితీగా సదర్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా మూసాపేటలో యాదవులు సదర్ సమ్మేళనాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ యువకులు కర్రలతో విన్యాసాలు చేస్తూ నృత్యాలు చేశారు. దున్నపోతుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మూసాపేట చౌరస్తాలో దున్నపోతులకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబురావు, ఐలయ్య యాదవ్, నర్సింగ్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్, రమేశ్‌యాదవ్, గణేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాల్లో దున్నపోతులతో విన్యాసాలు చేయిస్తున్న యాదవులు



మూసాపేటలో జరిగిన సదర్ సమ్మేళనంలో పాల్గొన్న యాదవులు

డ్రైనేజీ పనులు నిలిపివేత

జీహెచ్ఎంసీ మురుగునీటిని నిజాంపేట్ కార్పొరేషన్ డ్రైనేజీ కాలువలో కలుపొద్దు

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

పైప్‌లైన్ అనుసంధానం పనులను అడ్డుకుంటున్న కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రవికాంత్, స్థానికులు

దుండిగల్, నవంబర్1: జీహెచ్ఎంసీ పరిధి, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలుకాలనీలకు చెందిన మురుగునీటి కాలువ(డ్రైనేజీ)ను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన మురుగునీటి కాలువలో కలుపొద్దని 8, 9వ డివిజన్ల కార్పొరేటర్లు సురేశ్‌రెడ్డి, పాపేట్ల రజిత, బీఆర్ఎస్ నాయకుడు రవికాంత్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మురుగునీటి కాలువ పైప్‌లైన్‌ను కొలన్ రాఘవారెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన డ్రైనేజీ పైప్‌లైన్‌కు అనుసంధానం పనులు చేపట్టగా, కార్పొరేటర్లు సురేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రవికాంత్ అడ్డుకుని నిజాంపేట్ కమిషనర్ సాబేర్‌ఆలీకి ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు. గతంలోనే ప్రభుత్వవిప్, అరికెపూడి గాంధీ బలవంతంగా ఒకసారి డ్రైనేజీ పైప్‌లైన్‌ను అనుసంధానం చేయడం వలన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాసటవర్స్, లేక్‌వ్యూ, ఈశ్వర్‌విల్లాస్ తదితర కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని డ్రైనేజీ పైప్‌లైన్ వ్యాసార్థం పెంచకుండా మళ్లీ పైప్‌లైన్‌ను అనుసంధానం చేయడం కారణంగా డ్రైనేజీ పొంగిపొర్లి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని కమిషనర్‌కు వివరించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న కమిషనర్ సాబేర్ ఆలీ జీహెచ్ఎంసీ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన పనులను నిలిపివేయించారు. తమ అనుమతులు లేకుండా ఎలా డ్రైనేజీని అనుసంధానం చేస్తారంటూ పనులను నిలుపుదల చేయించారు.

దవాఖాన సేవలు మెరుగుపరచాలి

జగద్గిరిగుట్ట, నవంబరు1: జగద్గిరిగుట్ట బస్తీదవాఖానలో సౌకర్యాలు మెరుగుపరచాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీనివాసనగర్‌లోని ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించారు. అక్కడి సిబ్బంది, రోగులకు అందుతున్న సేవలు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం పేదలకోసం ప్రారంభించిన దవాఖానల్లో ఇప్పుడు కనీస వసతులు, మందులు లేవని విమర్శించారు. రక్తపరీక్షలు చేసేందుకు సిరంజి, సామగ్రి లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడి సమస్యపై జిల్లా అధికారులను సంప్రదిస్తే సరిగా స్పందించడంలేదని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్, రాములు, సదానంద్, బాబు, క్రాంతి, ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీదవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న సీపీఐ నాయకులు

నేటి నుంచి కార్తిక మాస పూజలు

దుండిగల్, నవంబర్ 1: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజుల రామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని సూరారం శివాలయనగర్, శివాహిల్స్‌లోని శ్రీఉమామహేశ్వర శైవ క్షేత్రంలో శనివారం నుంచి కార్తికమాసం పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త,బ ఋమ శక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1 వరకు ఆలయంలో ప్రతిరోజు అభిషేకం, అర్చనలు, సాయంత్రం ఆకాశ దీపారాధన నిర్వహిస్తామన్నారు. 4వ తేదీ శుద్ధ తదియ కార్తీక మాస మొదటి సోమవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకం అనంతరం అష్టోత్తర శతఘటాభిషేకం, 5న నాగుల చవితి సందర్భంగా పుట్ట వద్ద అభిషేకాలు, అర్చనలు, 11న శుద్ధ దశమి కార్తీకమాస రెండో సోమవారం సందర్భంగా ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 15న కార్తిక పౌర్ణమి సందర్భంగా ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, 18వ తేదీ అభిషేకాలు, అనంతరం బిల్వ పుష్పార్చనలు, 25వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు, ఉమామహేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవానికి హంపీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు.

ఏఈ రషీద్‌కు సన్మానం

బాలానగర్ డివిజన్ అభివృద్ధికి విశేషంగా కృషి చేసి శేరిలింగంపల్లికి బదిలీపై వెళ్లిన జీహెచ్ఎంసీ ఏఈ రషీద్‌ను బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.నరేంద్రాచార్య గురువారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

- బాలానగర్, నవంబర్ 1

ఔటర్‌పై డివైడర్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి...

ఆరుగురికి గాయాలు

శేరిలింగంపల్లి, నవంబర్ 1: ప్రమాదవశాత్తు కారు టైరు పేలి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. గచ్చిబౌలి పోలీసుల కథనం ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహన్(23) తన ఆరుగురు స్నేహితులతో కలిసి ఇన్నోవా కారులో గురువారం రాత్రి సంగారెడ్డికి బయలుదేరారు. ఔటర్ రింగ్‌రోడ్డులోని వట్టినాగులపల్లి సమీపంలోకి రాగానే ఇన్నోవా కారు టైరు ప్రమాదవశాత్తు పేలింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. అప్పటికే అబ్దుల్ రెహన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఆరుగురు ఇబ్రహీం, హసీం అహ్మద్‌ఖాన్, సయ్యద్ మగ్దూమ్ మసూద్, షేక్ సఫీయన్ అలీ, సయ్యద్ సైఫ్, అబ్దుల్ వాసీఫ్ గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

9న నిర్వహించాల్సిన ఎల్ ఎల్ ఎం పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: ఓయూ పరిధిలో ఈనెల 9న జరగాల్సిన ఎల్ఎల్ఎం పరీక్షను వాయిదా వేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జరగాల్సిన పరీక్షను తిరిగి ఈనెల 12న నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష కేంద్రం, సమయంలో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 1: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంటర్నేషనల్ స్టడీస్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 6వ తేదీ నుంచి, ఎమ్మెస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

మహనీయురాలు ఇందిరాగాంధీ

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

బాలానగర్, నవంబర్ 1: మాజీ ప్రధాని, దివంగత నేత ఇందిరాగాంధీ సేవలు మరువలేమని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన కోసం కృషి చేసిన మహనీయురాలు ఇందిరాగాంధీ అన్నారు. కార్యక్రమంలో నేతలు కరుణాకర్ నాయుడు, సంజీవరావు, మైకేల్, ఫణీంద్రకుమార్, రేష్మ, ప్రవీణ్‌కుమార్, రాజు ముదిరాజ్, శ్రీధర్‌చారి, లక్ష్మీనారాయణ, శేషగిరి రాయుడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దుండిగల్ : దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో అనేక సంస్కరణలు చేసి ప్రజాహిత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నేతలుగూడ ఐలయ్యగౌడ్, రషీద్‌బేగ్, జయరాం, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, ఖాజాభాయ్, కృష్ణ, లాల్‌మహమ్మద్, షాకీర్, బాలప్ప, రామిరెడ్డి, జలీల్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల దాడి.. పలువురికి గాయాలు

బాలానగర్, నవంబర్ 1: దీపావళి వేడుకలకు వచ్చి గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో పలువురికి గాయాలైన ఘటన కేపీహెచ్‌బీకాలనీ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ అడ్డగుట్టలోని ప్లాట్ నంబర్ 229సీకు చెందిన సూర్యప్రతాప్ వద్ద దీపావళి వేడుకలు జరుపుకొనేందుకు తన స్నేహితులు ఎం అరవింద్, ఎం.వినయ్, కల్యాణ్, ధీరజ్ గురువారం వచ్చారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో కేపీహెచ్‌బీలోని సిరి హోటల్‌లో టిఫిన్ చేసేందుకు ఐదుగురు స్నేహితులు వెళ్లారు. కాగా అరవింద్ వ్యక్తి వాష్ రూంకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లగా, వాష్ రూంవద్ద గుర్తుతెలియని వ్యక్తితో వాగ్వాదం జరిగి గొడవకు దారి తీసింది. అరవింద్‌తో వాగ్వాదానికి దిగిన వ్యక్తి అతడి స్నేహితులకు వెంటనే రావాలని, తనతో కొందరు గొడవ పడ్డారని ఫోన్‌లో చెప్పాడు. వెంటనే అరవింద్ తన స్నేహితులతో అక్కడి నుంచి బయలుదేరి ఇంటికి వెళ్లే క్రమంలో తబలా రెస్టారెంట్ వద్ద గుర్తు తెలియని 8 మంది వారిని అడ్డగించి కర్రలతో చితకబాదారు. ఈ ఘటనలో అరవింద్, వినయ్‌లకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దాం

యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్, నవంబర్ 1: కార్మికుల సమస్యల పరిష్కారానికై ఉద్యమిద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్ఎన్ రెడ్డి భవన్ ఎదుట జెండాను ఆవిష్కరించి సభ నిర్వహించారు. ఏఐటీయూసీ పోరాటాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఎన్నో కార్మిక చట్టాలను అమలు చేయించిందన్నారు. త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా సవరించిన కేంద్ర ప్రభుత్వంపై బలమైన పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వ సంస్థలు, చట్టాల అమలు, హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేం పావని, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, నాయకులు కమతం యాదగిరి, పానుగంటి పర్వతాలు, శ్రీనివాస్, పి.వెంకటయ్య, బి.కిషన్, జైపాల్‌రెడ్డి, మారగోని ప్రవీణ్ కుమార్, హసీనాబేగం, లక్ష్మీబాయి, ఉమర్ ఖాన్, రమేశ్ పాల్గొన్నారు.